
# సత్యవాక్కు

# The Word of Truth



# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'స త్య వా ణి' యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలుపొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి !!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA–533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం !!

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

పోస్ట్ బాక్స్ - **80**, కాకినాడ - **533 001**

ఎడిటర్ : జె. సి. ఛోట్

మేనేజింగ్ ఎడిటర్ : జాషువా గూటం

సంచిక **11** | జూన్ **1984** | సంపుటి **4**

# సంపాదకీయము

## ప్రార్థనపై కొన్ని యోచనలు

*( Some thoughts on Prayer )*

క్రైస్తవునికి ప్రత్యేకింపబడిన గొప్ప ఆశీర్వాదములలో ప్రార్థన యొకటి. ఒకడు దేవుని యొక్క బిడ్డ కాగోరవలసిన కారణములలో యిది ఒకటి. క్రైస్తవుని వలెనే క్రైస్తవేతరుడు ప్రార్థించుటకు తెగించిన యెడల, ఒకడు క్రైస్తవునిగా యుండవలసిన అవసరమేమున్నది? క్రైస్తవేతరుడు తనకొరకు, అవసరములలో యున్న తన ప్రియుల కొరకు తాను ప్రార్థన చేయజాలడని గ్రహించుకొన్నప్పుడు, అతడు దేవునికి లోబడవలసిన ఆవశ్యకత యున్నదని అది ప్రేరేపిస్తాది.

దేవుడు అందరికి తండ్రి యని నమ్మువారనేకమంది యున్నారు. ఆయన అందర్నీ సృజించెనుగాని, ఆయన అందరికి ఆధ్యాత్మిక తండ్రి కాడు. యేసు యూదులతో యిట్లు పలికాడు: "మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు; మీ తండ్రి దురాశలు నెరవేర్చగోరుచున్నారు. ఆది నుండి వాడు నరహంతకుడై యుండి సత్యమందు

నిలిచినవాడు కాడు; వానియందు సత్యమే లేదు; వాడు అబద్ధమాడు నప్పుడు తన స్వభావమును అనుసరించియే మాటలాడును; వాడు అబద్ధికుడును అబద్ధమునకు జనకుడునై యున్నాడు. నేను సత్యమునే చెప్పుచున్నాను గనుక మీరు నన్ను నమ్మరు" (యోహాను 8:44, 45).

ఈ ప్రజలు అవిశ్వాసులుగదా యని అనటానికి ఎవరైనా సిద్ధపడతారు. అంటే వారు విశ్వాసులను గూర్చి తెలిసికొన గోరుచున్నారు. గనుక విశ్వాసి యొక్క ప్రార్థనను తండ్రి తప్పక వింటాడని వారు తలుస్తున్నా రన్నమాట. గాని ఒకడు నమ్మినంత మాత్రాన దేవుని బిడ్డకాడు. ఒకడు ప్రభువునకు లోబడిన తరువాతనే దేవుని యొక్క బిడ్డ యగునని అతడు నమ్మవలెను. ఐతియోపీయాకు చెందిన ఒకనికి ఫిలిప్పు బోధించినట్లు మనం చదువుతాం. అతడు విశ్వాసి అయ్యాడు గాని అతడు ప్రభువుకు లోబడిన తర్వాతనే తన మార్గాన ఆనందిస్తూ వెళ్ళగలిగాడు (అపొ. కా. 8:26-39). అప్పుడు మాత్రమే ఒకడు ప్రార్థనద్వారా తండ్రి యొద్దకు చేరగలడు.

ఒకడు తండ్రితో ప్రార్థనా సంబంధాన్ని కల్గి యుండాలంటే దేవుని బిడ్డగా పవిత్రమైన భక్తిగల జీవితాన్ని జీవించాలి. ఒకడు హృదయ పూర్వకంగా పాపం చేస్తే, వానికి తండ్రికి మధ్య ఆ పాపం అడ్డు వచ్చి, వాని యొక్క ప్రార్థనను తండ్రి ఆలకించకుండా చేస్తాది. "రక్షింపనేరక యుండునట్లు యెహోవా హస్తము కురుచ కాలేదు. విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు. మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగు పరచెను. గనుక ఆయన ఆలకింప కున్నాడు" (యెషయా 59 : 1, 2). మరొక మాటలో, నీతిమంతుని విజ్ఞాపన బహు బలముగలదై యుంటాదని యాకోబు చెప్పాడు (యాకోబు 5:16).

మనము దేవునియొక్క పిల్లలమై, ఆయన యెడల నమ్మకముగా యున్నట్లయితే, ఆయన మన ప్రార్థనలు ఆలకించాలని ఆశింపవచ్చా? ఆయన మన ప్రార్థనలు వినడం మాత్రమే కాదుగాని ఆయన చిత్తానుసారముగా ప్రార్థిస్తే మన ప్రార్థనలను సిద్ధింపజేస్తాడు. "ఆయననుబట్టి మనకు కల్గిన ధైర్యమేదనగా, ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే. మనమేమి అడిగినను ఆయన మన మనవి ఆలకించునని మన మెరిగిన యెడల మన మాయనను వేడుకొనినవి మనకు కలిగినవని యెరుగుదుము" అని యోహాను చెప్పాడు (1 యోహాను 5:14, 15). తండ్రి చిత్తానుసారముగా అడుగుటవలననే మన ప్రార్థనలకు జవాబియ్యబడుచున్నదనే అసలు విషయాన్ని దయచేసి గమనించండి. మనము దేవుని పిల్లలమని ఆయన మన తండ్రి యని గ్రహించుకొనవలెను. ఈ లోక సంబంధమైన మన పిల్లలతో వ్యవహరించునప్పుడు, మనం వారి కోరికలన్నీ వింటాం. గాని వాళ్ళ కోర్కెలన్నీ తీర్చేస్తామని దాని అర్థంకాదు. మనం మానవమాత్రులం కాబట్టి వారియొక్క కొన్నికోర్కెలు తీర్చలేకపోవచ్చును. లేక వారియొక్క శ్రేయస్సును సంక్షేమాన్ని కోరి కొన్ని కోర్కెలు తీర్చము. మనము మన పిల్లలతో వ్యవహరించునట్లే, మన ఆధ్యాత్మిక తండ్రి తన ఆధ్యాత్మిక పిల్లలమైన మనతో కూడ వ్యవహరించు ననుట వాస్తవమే. ఆయన అన్నింటిని చేయటానికి అన్నింటిని అనుగ్రహించుటకు శక్తిగలవాడే గాని ఆయన అన్ని అనుగ్రహించేస్తాడని దాని భావంకాదు. మన ప్రార్థనలు ఆయన చిత్తానుసారముగా యుండి, మనకు మంచిని చేకూర్చేవైతే ఆయన తప్పనిసరిగా మన కోర్కెలను నెరవేరుస్తాడు. గాని ఆయన చిత్తానికి వ్యతిరేకముగా లేక మనకుగాని పరులకుగాని ప్రయోజనము లేని వాటికై అడిగితే ఆయన మన ప్రార్థనలకు జవాబియ్యడు. దీన్నిబట్టి మనకు నిరుత్సాహం కల్గినా గాని, తండ్రి మనలను ప్రేమిస్తున్నందువలన

మన బాగును కోరి మనకు హానికరమైన వాటిని, మనలను నాశనంచేసే వాటిని మనకు దయచేయడని తెలియజేస్తున్నది. మనకు ఉత్తమమైన దేదో అది మన తండ్రి ఎరిగియున్నవాడని మనము నమ్మవలెను. పిమ్మట ఆయన నిర్ణయాన్ని అంగీకరించవలెను.

కొన్ని సార్లు మనం ఉద్యోగం కొరకు, మంచి ఆరోగ్యంకొరకు యిలాంటి అనేకమైన వాటికొరకు ప్రార్థన చేయువచ్చును. ఈ కోర్కెలు అనుగ్రహింప బడలేదనుకోండి. అప్పుడు దేవుడు మన ప్రార్థన విన లేదు. లేక ప్రార్థన చేయటంవలన లాభం లేదనుకొంటాం. గాని మరొక్కసారి ఆలోచించండి. మనం అడిగినప్పుడు ఉద్యోగం వచ్చేసింది అనుకోండి. అప్పుడు మనము చాలా సంతోషంగా ఉంటాము. గాని చివరకు అది మనమీదికి నాశనాన్ని తెస్తాదేమో. లేకపోతే, అంతకంటె మంచి ఉద్యోగం రాకుండా జేస్తాదేమో. శ్రేష్టమైన దేదో మన కెప్పుడూ తెలియదుగదా. లేక మన మా ఉద్యోగం సంపాదించటానికి ఏమి చేయకుండా అంతా ప్రభువే చేసేస్తాడేమో అనుకున్నామేమో. మనము చేయాల్సింది మనం చేయటానికి యిష్టపడక పోతే తండ్రి ప్రతీదీ చేయాలని ఎందుకు ఆశించాలి? మన ఆరోగ్యం విషయంలోను కూడ అంతే నిజం. మన ఆరోగ్యాన్ని పాడుచేసే వాటిని తింటూ, లేక చేస్తూ మంచి ఆరోగ్యముతో ప్రభువు మనల్ని దీవించాలని అడుగుచూ యుండవచ్చును. మంచి ఆరోగ్యం కల్గి యుండటానికి అవశ్యకమైన వాటిని చేయకుండా మన ఆరోగ్య విషయములో అశ్రద్ధచేస్తూ మంచి ఆరోగ్య మీయమని ఆయన్ని ఎందుకు అడగాలి?

గాని మనం ఏమి ప్రార్థన చేసామో పూర్తిగా మరచిపోయి, సంభవింపనై యున్న వాటి విషయములో తప్పక నెరవేరతాదని బలముగా నమ్ముచున్నట్లయితే, తుదకు నీవు విస్మయం నొందుతావు. కాదు, అది యధార్థం కాదు. మనం మానవ మాత్రులమని, గత చరిత్రను, దేవునిని, ఆయన కార్యసాధక శక్తిని మనము గ్రహింపలేక

పోవుచున్నామనే వాస్తవముపై మన సమస్య ఆధారపడి యున్నది. ఇలాంటి కొన్ని సంగతులను గూర్చి లేఖనములు గత చరిత్రను మనకు అందిస్తున్నాయి. పేతురు చెరసాలలో యున్నప్పుడు, ప్రభువుయొక్క జనులు అతని విడుదలకై దీక్షతో ప్రార్థిస్తున్న సంగతి మీకు జ్ఞాపక మున్నదా ? (అపొ. కా. 12). అప్పుడు ప్రభువుయొక్క దూత ఏతెంచి అతన్ని ఎలా విడిపించాడో మన కా రికార్డు చెబుతున్నది. తుదకు, పేతురు బయలుదేరి క్రైస్తవులు కూడియున్న చోటికి వెళ్ళాడు. అతడు తలుపు తట్టగా, అతన్ని అక్కడ చూచిన శిష్యులు నిర్ఘాంత పోయారు. అది అద్భుత సంఘటనయే అయినా ప్రార్థనలకు జవాబిచ్చుటకు గాను దేవుడు ఏలాగు క్రియ జేసియున్నాడో అది మనకు తెలియ జేస్తున్నది. దేవుడు నేడు అద్భుతాలను చేయాలని మనం ఆశింపక పోయినను, అటువంటివి ఆయన చిత్తానుసారము కాకపోయినప్పటికిని, ఆయన మన ప్రార్థనలకు జవాబిచ్చుటకు ప్రకృతి చట్టములద్వారాను ముందు జాగ్రత్త చర్యల వలనను నేడింకను ఆయన కార్యసిద్ధి కలుగ జేయగలడు. ఉదాహరణకు - రోగులు కోలుకొనుటకు వైద్యుల ద్వారాను, నర్సులద్వారాను, ఔషధములు మున్నగు వాటిద్వారా ఆయన తోడ్పడతాడు. ఏ విధముగానైనా అది జరుగదా ? జరుగక పోవచ్చును. తండ్రి మీప్రార్థనలను ఆలకిస్తూ, పట్టించుకొంటూ ప్రతి విషయములో తన పిల్లలకు సహాయముచేయ గోరుచున్నాడని మీరు తండ్రి యందు విశ్వాసముంచాలి. ఉదాహరణకు - విమానము నిండుగా ప్రయాణిస్తువారు, దానిలోనున్న క్షేమార్థమై చేసిన ఒక క్రైస్తవుని ప్రార్థనవలన వారు ఆ విమాన ప్రమాదంనుండి తప్పించు కొన్నారనుకొందాం. అయితే, నమ్మకస్తుడైన క్రైస్తవుడున్న విమాన మొకటి ప్రమాదానికి గురియైనదనుకోండి, మరి దాని సంగతి ఏమిటి? తండ్రికి తెలిసినవన్ని మనకు తెలియవు, ఆయన చూచేవాటిని మన మెల్లప్పుడు చూడలేము. మనమెన్నడు ఆయన జ్ఞానాన్ని శంకించ కుండా, అటువంటి విషయాల్ని ఆయన హస్తాలకే వదలివేయాలి.

క్రైస్తవుడు ఎంత తరచుగా ప్రార్థించవలెను? అతడు సహాయం పొందవలసిన స్థితిలో నున్నప్పుడు లేక ఏదైనా పొంద నపేక్షిస్తున్నప్పుడు దాని విషయమై పదేపదే ప్రార్థించాలి. తరచుగా ప్రార్థించుట వలన ఏమైనా అభ్యంతరము కల్గుతుందా? యేసు చెప్పిన ఈ కథను గమనించండి: "వారు విసుగక నిత్యము ప్రార్థన చేయుచుండవలెననుటకు ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను. దేవునికి భయపడకయు మనుష్యులను లక్ష్యపెట్టకయు నుండు ఒక న్యాయాధిపతి యొక పట్టణములో ఉండెను. ఆ పట్టణములో ఒక విధవరాలును ఉండెను. ఆమె అతని యొద్దకు తరచుగా వచ్చి - నా ప్రతివాదికిని నాకును న్యాయము తీర్చుమని అడుగుచు వచ్చెను గాని అతడు కొంత కాలము ఒప్పకపోయెను. తరువాత అతడు-నేను దేవునికి భయపడకయు మనుష్యులను లక్ష్య పెట్టకయు ఉండినను ఈ విధవరాలు నన్ను తొందర పెట్టుచున్నది. గనుక ఆమె మాటిమాటికి వచ్చి గోజాడకుండునట్లు ఆమెకు న్యాయము తీర్తునని తనలో తాననుకొనెను. మరియు ప్రభువిట్లనెను-అన్యాయస్థుడైన ఆ న్యాయాధిపతి చెప్పినమాట వినుడి. దేవుడు తాను ఏర్పరచుకొనినవారు దివారాత్రులు తన్ను గూర్చి మొఱ్ఱపెట్టు కొనుచుండగా వారికి న్యాయము తీర్చడా? ఆయన వారికి త్వరగా న్యాయము తీర్చును. వారి విషయమే గదా ఆయన దీర్ఘశాంతము చూపుచున్నాడని మీతో చెప్పుచున్నాను. అయినను మనుష్య కుమారుడు వచ్చునప్పుడు ఆయన భూమిమీద విశ్వాసము కనుగొనునా?" (లూకా 18:1-8). కొన్నిసార్లు మన పిల్లలు మనలనుఏదైనా అడిగినప్పుడు, మొదట వారి యొక్క కోరికలను మన్నించమని తండ్రులమైన మన మెరుగుదుము. గాని వారు మాటి మాటికీ అడుగుచూ విజ్ఞాపన చేస్తున్నట్లయితే, వారి కోర్కెను తీర్చకుండుట కేమీ ప్రత్యేకకారణం లేకపోతే వారి కోర్కెను తీరుస్తాం. వారు అస్తమానము అడగకుండినట్లయితే వారియొక్క కోర్కెను తీర్చము. మన

పరలోక తండ్రి విషయంలోను యిదే వాస్తవం. మన ప్రార్థనల్లో మనం పట్టు విడువకుండా యుండుటవలన మనము ఆయన యొక్క సహాయాన్ని అర్థిస్తున్నామని, ఆయన యందలి మన విశ్వాసాన్ని కనబరుస్తామని దాని యర్థము. తద్వారా ఆయన ఫలితాన్ని అనుగ్రహించుట ద్వారా మన ప్రార్థనలకు జవాబిచ్చును.

ఔను, క్రైస్తవునిగా యుండి, మనలను ప్రేమించి, పట్టించుకొని మన సమస్యలలోను, అవసరములలోను ఆదుకొనగల్గిన తండ్రిని కల్గియుండటం ఎంత మనోహరం! దీని నంతటినీ ఎరిగినవాడు దేవునితో ఈ ప్రత్యేక సంబంధము కల్గియుండకుండా తనంతట తానే యెట్లు జీవించగలడు? దేవుని యొక్క బిడ్డగా యగుటకు జాప్యము చేయువాని జీవితం మిక్కిలి భయంకరం. దేవుడు లేకుండా జీవింప ప్రయత్నించు వానికి ఇప్పటి జీవితం శూన్యం. రాబోవు లోకము విషయములో ఆశయే లేదు. నీ యొక్క స్థితిని, నీయొక్క ఆధ్యాత్మిక స్థితిని పునరాలోచించు కొనుము. దేవునికి లోబడునట్లు ఇప్పుడే నిర్ణయించుకో. ఆయన యొక్క బిడ్డవగుము. ఆయన నీకై దాచియుంచిన దీవెనలను పొందుము. ఇది నీ జీవితములో తీసికొన్న జ్ఞానయుక్తమైన నిర్ణయ మౌతాది.

ఇవి ప్రార్థనను గూర్చిన కొన్ని తలంపులు మాత్రమే. నేను దీనిలో ప్రార్థనద్వారా దేవునితో కల్గియుండాల్సిన సంబంధమును గూర్చి తెలియజేసాను. చెప్పాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. అవి తర్వాత తెలిసికొందాం.

---

## క్రీస్తు సువార్తను చెరుపగోరే "వెయ్యేండ్ల పాలన" సిద్ధాంతము

క్రీస్తు సువార్తను చెరుపగోరి మిమ్మును కలవరపరచు వారు కొందరున్నారు జాగ్రత్త అని పౌలు హెచ్చరించుచున్నాడు (గలతి 1:7).

యేసుక్రీస్తు తన మొదటి రాకడలో రాజ్యము స్థాపించుటకు వచ్చెనని ఎవ్వరు సందేహించరు. "వెయ్యేండ్ల పాలన" యున్నదనే వారు కూడా దీనిని నమ్ముచున్నారు. అప్పటి యూదులు, మెస్సీయా వచ్చి గొప్ప రాజ్యము స్థాపించునని ఎదురుచూచిరి - యిప్పుడుకూడా ఎదురుచూచుచునే యున్నారు. వారితోపాటు "వెయ్యేండ్ల పాలన" వారు కూడా ఎదురుచూచుచున్నారు, ఎదురుచూడమని బోధించుచున్నారు. ఎందుకనగా క్రీస్తు వారు వచ్చినప్పుడు ఆయనను యూదులు నిరాకరించినందున, ఆయన రాజ్యస్థాపన చేయ వీలులేక దానిని 'వాయిదా' వేసి, కొంత కాలమువరకు పెట్టెలో పెట్టి తాళము వేసెనని వారు నమ్ముచున్నారు. దేవుడు ఉద్దేశించినట్టియు, పాత నిబంధనలో భక్తులు ప్రవచించినట్టియు, యోహాను, యేసుక్రీస్తువారుకూడా సమీపముగా యున్నదని ప్రకటించినట్టియు రాజ్యమును-యూదుల నిరాకరణమూలముగా స్థాపించకుండ, మొత్తము సంకల్పమునే మార్చుకొని, రాజ్యమునుగూర్చి ప్రకటించకుండా, రాజ్యమును గూర్చిన ఉపమానములతోనే కాలము గడిపి, యూదుల చేతిలో తన ఓటమిని అంగీకరించి, యేసుక్రీస్తువారు అప్పటికప్పుడు ఒక క్రొత్త ఆలోచనతో రాజ్యమునకు బదులుగా "సంఘమును" తాత్కాలికముగా స్థాపించి పరలోకమునకు తిరిగి వెళ్ళెననియు, తన మొదటి రాకడలో చేయవలసినట్టి పని సఫలీకృతము కాలేకపోయినందున, రాజ్యము స్థాపించుటకు ఆయన రెండవమారు రాబోవుచున్నాడని "వెయ్యేండ్ల పరిపాలన" వారు అదేపనిగా గోలబెట్టుచున్నారు. (See P. 34 last paragraph in Kingdom of God - by R.H. Boll).

ఆయన రెండవమారు వచ్చినప్పుడు తన ఉద్దేశ్యము నెరవేరునని నమ్మకమేమిటి? యూదులు ఆయనను అంగీకరింతురని 'గ్యారంటీ' ఏమిటి? అని అడిగితే - లేదు, లేదు ఆయన తప్పక తన ఉద్దేశ్యమును నెరవేర్చుకొంటాడు, మీకా సందేహమువద్దు అని వారు అంటున్నారు.

ఎందుకంటే - ఇవిగో ప్రవచనములు కుప్పలు కుప్పలుగా పాత నిబంధనలో వున్నవి, చూడండి అని అంటున్నారు; గాని, చిత్రమేమిటంటే - ఆయన మొదటి రాకడలో వచ్చి రాజ్యము స్థాపించునని చెప్పబడినవే యివి గూడా. అన్ని ప్రవచనము లుండియు ఆయన తన మొదటి రాకడలో (యూదులు చేసిన ఒక చిన్న 'వీటో'తో) రాజ్య స్థాపన చేయలేకపోతే మరి రెండవ రాకడలో అవే ప్రవచనములు, పనిచేయగలవని 'గ్యారంటీ' ఏమిటి? ఆవిధముగా ఎవరైన నమ్మగలరా? ఈ గందరగోళమంతా 'వెయ్యేండ్ల పాలన' వారు సృష్టించిన 'వాయిదా' (Postponement) సిద్ధాంతము మాత్రమే. మరియొక సారి చూడండి — క్రీస్తువారు మొదటి రాకడలో రాజ్యస్థాపన చేయలేక, దానిని రెండవ రాకడకు 'వాయిదా' వేసి, రాజ్యమునకు బదులుగా, 'సంఘమును' స్థాపించి పోయెనట; అందుకని ఈ యుగమునకు 'సంఘయుగము' అని పేరుగూడా పెట్టి యున్నారు. పైగా, వారేమంటున్నారంటే - కొలస్స 1:13 లో చెప్పబడిన క్రీస్తు రాజ్యము వేరేది, అది ఆయన ఉద్దేశించినది కాదు. మరి యిది ఎందుకు second hand రాజ్యమో, ఎక్కడనుండి వచ్చినదో, ఎచట ప్రవచింప బడినదో, వారియొక్క అసలు రాజ్యమునకును దీనికిని భేదమేమిటో చెప్పగలరా? వారి మెల్లకంటికి రెండు రాజ్యములు కనబడుచున్నవి. క్రీస్తువారు మాత్రము తనకున్నది ఒకటే రాజ్యమని చెప్పుచున్నారు.

## మార్పు వీలులేని ప్రవచనములు

పాత నిబంధనలోని ప్రవచనములన్నియు, క్రీస్తువారి మొదటి రాకడను గూర్చియే చెప్పబడిన యెడల, అవి ఎట్టి పరిస్థితులలోను రెండవ రాకడకు మార్చబడుటకు వీలులేదు. ఒకవేళ అవి రెండవ రాకడను సూచిస్తే అవి మొదటి రాకడకు చెందనట్లే. అట్టి ప్రవచనము లన్నియు క్రీస్తు రెండవ రాకడకు చెందినవైతే - ఆయన మొదటి రాక ప్రవచనములు లేకుండా వచ్చినదై ఏమియు సాధించకుండా

నిష్ఫలమైనట్లే గదా! కాబట్టి వారు "సంఘ యుగము"గా పేరుపెట్టిన యీ యుగము, ప్రవచన హీనమైనదిగా చేసి, ఈ యుగములోని క్రీస్తు సువార్తవలని రక్షణ కార్యక్రమమును నిరాకరించుచున్నట్లే గదా! గనుక వారి ఉద్దేశ్యము ప్రకారము - ఏ మనుష్యుడును 'వెయ్యేండ్ల పరిపాలన' సిద్ధాంతమును నమ్ముచున్నట్లయితే, క్రీస్తు సువార్త, ప్రవచనములతో కూడినది కానందున దానిని నమ్మగలడా? ఒకవేళ క్రీస్తు సువార్తను విశ్వసించినట్లయితే 'వెయ్యేండ్ల పాలన' సిద్ధాంతమునకు విరుద్ధమే గదా! కొందరు అనుకొనుచున్నారు మేము రెండూ నమ్మగలమని. అది వట్టి భ్రమ మాత్రమే. అంటే వారికి, అటు 'వెయ్యేండ్ల పరిపాలనను' గూర్చిగాని, ఇటు 'క్రీస్తు సువార్త శక్తిని' గూర్చిగాని పూర్తిగా తెలియలేదన్న మాటే. వారిది half-knowledge మాత్రమే which is always dangerous. యేసుక్రీస్తు వారి కాలములోని యూదులు, క్రీస్తు సువార్తను అంగీకరించకపోయి వారి విషయమైన దేవుని సంకల్పమును నిరాకరించి (లూకా 7:30), ఇహలోక సంబంధమైన రాజ్యముకొరకే ఎదురు చూచినందున, యిప్పటి కాలములో వీరుకూడా ఇహలోక సంబంధమైన రాజ్యము కొరకే ఎదురు చూచుచున్నందున - వీరిని 'వెయ్యేండ్ల పాలనవారు' అనుటకంటే 'యూదా మానస పుత్రులు' అని అంటే సమంజసముగా వుంటుందేమో కొంచెము ఆలోచించండి. వీరికి కావలసింది 'రక్షణ' కాదు, భూమిమీద 'రాజ్యం'.

## దేవుని నిత్య సంకల్పములో సంఘము

ఎఫెసీ పత్రిక మూడవ అధ్యాయములో 'సంఘము'ను గూర్చి, పరిశుద్ధాత్మ ప్రేరితుడైన, అపొస్తలుడైన పౌలు ఏమి చెప్పుచున్నాడో గమనింతము: "దేవుడు మన ప్రభువైన, క్రీస్తు యేసునందు చేసిన నిత్యసంకల్పము చొప్పున, పరలోకములో ప్రధానులకును, అధికారులకును, సంఘముద్వారా తనయొక్క నానావిధమైన జ్ఞానము యిప్పుడు

తెలియబడవలెనని ఉద్దేశించి, శోధింప శక్యముకాని క్రీస్తు ఐశ్వర్యమును అన్యజనులలో ప్రకటించుటకును, సమస్తమును సృష్టించిన దేవునియందు పూర్వకాలమునుండి మరుగైయున్న ఆ మర్మమును గూర్చిన ఏర్పాటు ఎట్టిదో అందరికి తేటపరచుటకును పరిశుద్ధులందరిలో అత్యల్పుడనైన నాకు ఈ కృప అనుగ్రహించెను" (ఎఫెసి 3:8-11).

పూర్వకాలము నుండి దేవునియొద్ద వున్న 'ఒక మర్మము' యిపుడు పౌలుకు 'తేటపరచబడినదట'. ఆ 'మర్మము' ఏమిటో అని ఊహాగానము చేయవలసిన అవసరము లేదు. ఎందుకంటే - అది ఏమిటో పౌలుకు తేటపరచబడినది. ఏమిటా మర్మము? 'సంఘము' అనునది క్రీస్తు యేసునందు నిత్యసంకల్పమై యున్నది. సృష్టికర్తయైన దేవునియందు, పూర్వకాలము నుండే ఈ ఉద్దేశ్య మున్నట్లును, అట్టి 'సంఘము' ద్వారానే తన యొక్క నానావిధమైన జ్ఞానము తెలియబడవలెనని కూడా వున్నట్లు తెలియుచున్నది.

'క్రీస్తుసంఘము' ద్వారానే దేవుని నానావిధమైన జ్ఞానము తెలియబడవలసి యుండగా - దేవుని నిత్యసంకల్పమైనటువంటి 'సంఘమును' రాజ్యమునకు బదులు ఏదో తాత్కాలిక ఏర్పాటు అనుటను ఏమనాలి? ఆ విధముగా అనుట దేవుని నిత్య సంకల్పమునే శంకించుట కాదా! మరి యూదా మానస పుత్రుల సిద్ధాంత మేమనుచున్నదో చూతము :—

దేవుడే రాజ్యస్థాపనము నుద్దేశించెను; రాజ్యము ప్రవచింపబడినది; క్రీస్తువారు రాజ్యస్థాపనకై వచ్చిరి; సంఘమనునది దేవుని తలంపులో లేదు; సంఘమును గూర్చి ప్రవచనములు లేవు; పాత నిబంధన ప్రవచనములన్నియు 'రాజ్యము'ను గూర్చినవే; వాటిని నెరవేర్చుటకే యేసుక్రీస్తు వచ్చినది; యూదులు ఆయనను నిరాకరించి, ఆయన రాజ్యస్థాపనను చెడగొట్టిరి; దేవుని సంకల్పమునే ఓడించిరి; అందువలన రాజ్యమునకు బదులుగా మనకు 'సంఘము' యివ్వబడెను. ఇదే

సంఘయుగము; ప్రమాదవశాత్తు మనము 'సంఘయుగము'లో నెట్టబడ్డాము; గాని మనము 'రాజ్యము' కొరకే నిరీక్షించవలెను" అని. (see-Page 46 Kingdom of God-by R.H. Boll)

## సంఘము ద్వారా, సదాకాలము మహిమ

కాని, ఎఫెసీ 3:8-11 లో, 'సంఘ నిర్మాణము' దేవుని నిత్య సంకల్పములోనిదని, ఆదిలో నుండి, లోకాంతమువరకు 'సంఘము' దేవుని ఉద్దేశ్యములో వుండెనని చూచుచున్నాము. "జగత్తు పునాది వేయబడక మునుపే, ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచు కొనెను" (ఎఫెసీ 1:6) అని వున్నది. "దేవునికి క్రీస్తు యేసుమూలముగా సంఘములో తరతరము సదాకాలము మహిమ కలుగును గాక, ఆమేన్" అని ఎఫెసీ 3:21 లో ఉన్నది. దీనివలన సంఘమనునది దేవునికి మహిమ కలుగుటకై, తరతరములు, సదాకాలము వుండవలెనని తెలియుచున్నది. 'క్రీస్తు సంఘము' క్రీ॥ శ॥ 33 లో యెరూషలేములో స్థాపించబడి యిప్పటికి ఎన్నితరముల నుంచి యున్నది? యుగ సమాప్తివరకు యుండును (మత్తయి 28:18-20).

కనుక ఈ 'సంఘ యుగము' అనునది, తాత్కాలికము కాదు గాని, సదాకాలము, యుగాంతము వరకు వుండునట్టిదని తెలిసినదా ? లేదా ?

రాజ్యమునకు బదులుగా 'సంఘము' తాత్కాలికముగా నియమింపబడినది అనుకుందాము. అప్పుడు 'రాజ్య యుగము' ఆరంభము కావలెనంటే, 'సంఘ యుగము' అంతము కావలెనుగదా ? కనుక 'రాజ్య యుగము' ఆరంభమై 'సంఘ యుగము' అంతమైతే ? దేవునికి తరతరములు, సదాకాలము మహిమ ఎట్లా కలుగుతుంది - అట్టి మహిమ సంఘముద్వారానే కలుగవలసి యుండెను (ఎఫెసి 3:21). గనుక తేలిన సారాంశ మేమనగా - లోకాంతము కాకుండా, ఎట్టి పరిస్థితులలోను, 'సంఘ యుగము' అంతముకాదు. దానికి విలోమ

ముగా - 'సంఘ యుగము' అంతమవగానే లోకాంతము జరుగును - మరి 'రాజ్య యుగమునకు' తావేది? అప్పుడు ఈ భూమి, దానిమీది కృత్యములు, పంచభూతములు భస్మమై పోవునని 2 పేతురు 3:10 చెప్పుచున్నది గదా!

'సంఘ యుగము' అంత మవగానే 'రాజ్య యుగము' ఆరంభ మగును. వెయ్యేండ్లు పరిపాలన చేయుటకు సిద్ధము కండని ఎదురు చూచే వారికి ఎదురవబోవునది ఏమిటో 2 పేతురు 3 : 11-12 చూతము - "ఇవన్నియు యిట్లు లయమై పోవునవి గనుక, ఆకాశములు రవులుకొని లయమై పోవునట్టియు, పంచభూతములు మహా వేండ్రముతో కరగిపోవునట్టి దేవుని దినపు రాకడ కొరకు కనిపెట్టుచు దానిని ఆశతో అపేక్షించుచు..." అని యున్నది. అట్టి పరిస్థితులలోనేనా వారి 'రాజ్య యుగము'? జాగ్రత్తగలవారై యుండుడి.

—విక్టర్ D. తురాక, తెనాలి.

---

# దైవిక ప్రేమ

యెహోవా యిట్లనెను : శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను. గనుక విడువక నీయెడల కృప చూపు చున్నాను (యిర్మియా 31:3). నేను నిన్ను నా ప్రేమ కనికరములచేత, నా యొద్దకు నిన్ను పిలుచుకొంటిని.

పై నుదహరించిన దైవిక ప్రేమను గూర్చి కొంత ధ్యానించు కొందము. దేవుని ప్రేమ శాశ్వతమైనది, మార్పులేనిది, పవిత్రమైనది. ఆయన ప్రేమలో దయా కనికరములతో పాటు క్షమాపణ యిమిడి యున్నది. దైవప్రేమ అన్ని పాపములను కప్పును (1 పేతురు 4:8). దేవుడు ప్రేమాస్వరూపి (1 యోహాను 4:8). కాన క్రైస్తవుడు క్రీస్తు ప్రేమను ధరించుకొనవలెను (కొలస్స 3:14). దైవిక ప్రేమను

మనము కలిగియున్న యెడల, క్రీస్తు మనలో నివసించుచున్నాడనియు, మనము ఆయనను కలిగి యున్నామనియు తెలిసికొనవలెను.

## మానవ ప్రేమ

మనుష్యుల ప్రేమలో స్వార్థము యిమిడియున్నది. మనుష్యుల స్వభావము అనేకసార్లు కీడుచేయుటకు సాహసించును. అందునుబట్టే పరి॥ పౌలు నిజమైన ప్రేమ తన పొరుగువానికి కీడు చేయదు, గనుక ప్రేమగలిగి యుండుడని హెచ్చరించెను. మీ ప్రేమ నిష్కపటమైనదై యుండవలెను. చెడ్డదాని నసహ్యించుకొని, మంచిదానిని హత్తుకొని యుండుడి. సహోదర ప్రేమ విషయములో ఒకరియెడ నొకరు అనురాగము కలవారై యుండుడని, దైవప్రేమను గూర్చి పరిశుద్ధాత్ముడు బహుగా హెచ్చరించుచున్నాడు. ధర్మశాస్త్ర మంతయు నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించుము అను ఒక్క మాటలో సంపూర్ణమై యున్నది (గలతి 5 : 14). మీరు నన్ను ప్రేమించినయెడల నా ఆజ్ఞలను గైకొందురు అని యేసు చెప్పెను (యోహాను 14:15). అందుకే నేను ప్రేమించువారిని గద్దించి శిక్షించుచున్నాను అనగా క్రమపర్చుచున్నాను (ప్రకటన 3:19). నీ సహోదరుని ప్రేమించవలెననునదియే దేవుని ఆజ్ఞ (1 యోహాను 4 : 21). ఇట్టి ఆజ్ఞను అతిక్రమించుట అవిధేయత అని చెప్పకతప్పదు.

## దేవుని ప్రేమ

దేవుని ప్రేమ స్వార్థములేనిది. త్యాగపూరితమైనది. దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా, ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను (యోహాను 3:16). ఈ ప్రేమ త్యాగముతో కూడినది. క్రీస్తు మిమ్మును ప్రేమించి పరిమళ వాసనగా యుండుటకు, మన కొరకు తన్నుతాను దేవునికి

అర్పణగాను, బలిగాను అప్పగించుకొనెను. అలాగుననే మీరును ప్రేమగలిగి నడుచుకొనుడి (ఎఫెసి 5:2).

అయినను మొదట నీకుండిన ప్రేమను నీవు వదలితివని, నేను నీమీద తప్పు ఒకటి మోపవలసియున్నది (ప్రకటన 2:4) అని ప్రభువైన యేసుక్రీస్తు ఎఫెసు సంఘమును హెచ్చరించుచున్నాడు. క్రీస్తు ప్రేమ తన వైపునకు మరలించుకొనునట్లు అనేక హెచ్చరికలతో, ఈ అంత్యదినములలో, తన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘమును హెచ్చరించుచున్నాడు. ప్రారంభ దినములలో ఈ ప్రేమను మరిమరి జ్ఞాపకము చేయుట గమనార్హము. పరిశుద్ధాత్ముడు పదేపదే హెచ్చరించుచు, క్రైస్తవ సంఘములను నడిపించువారలను క్రీస్తు ప్రేమ అను ఐక్యతలోనికి ప్రవేశించవలెనని తన ప్రవక్తలద్వారా బయలుపరచుట యెంతగానో కనబడుచున్నది. క్రీస్తు ప్రేమలో విమర్శలు లేవనియు, క్రీస్తు ప్రేమ ఉప్పొంగనిది, డంభముగా మాటలాడనిది, అని దైవగ్రంథము మనకు బోధించుచున్నది. మీరు విశ్వాసము గలవారై యున్నారో లేదో, మిమ్మును మీరే పరిశోధించుకొనుడి. మిమ్మును మీరే పరీక్షించుకొనుడి. మీరు భ్రష్టులు కానియెడల, యేసుక్రీస్తు మీలో నున్నాడని, మిమ్మును గూర్చి, మీరే యెరుగరా? మేము బలహీనులమై యున్నను, మీరు బలవంతులై యుండిన ఎడల సంతోషించెదము. దీని నిమిత్తమే మీరు పరిపూర్ణులు కావలెనని ప్రార్థించుచున్నాము. మేము సత్యమునకు విరోధముగా ఏమియు చేయనేరము. గాని, సత్యము నిమిత్తమే సమస్తమును చేయుచున్నాము. గనుక క్రైస్తవ సహోదరా, ప్రభువునందు సంతోషించుడి. పరిపూర్ణులై యుండుడి. ఆదరణ కలిగియుండుడి. ఏకమనస్సు గలవారై యుండి. సమాధానముగా యుండుడి. ప్రేమ సమాధానములకు కర్తయగు దేవుడు మీకు తోడై యుండునట్లు మీ బలహీనతలను గ్రహించి, క్రీస్తు ప్రేమను కలిగి, ప్రేమా ఐక్యతలో ముందుకు

సాగుచు, ఆయన శాశ్వత ప్రేమను అనేక జనాంగములకు కనపరచు నిమిత్తము ఒకరి నొకరము ప్రేమించుకొనుచు, ఆయన ఘనమైన సేవలో ముందుకు సాగవలెనని తోటి క్రైస్తవ సహోదరునిగా, క్రీస్తు ప్రేమ చేత హెచ్చరిక చేయుచున్నాను.

ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసము, మన అందరికి తోడై యుండునుగాక. ఆమేన్.

— R. సుందరం, ప్రొద్దుటూరు

---

విశ్వాస వీరులు - 5

## ఇస్సాకు
## *( Isaac )*

"విశ్వాసమునుబట్టి ఇస్సాకు జరుగబోవు సంగతుల విషయమై యాకోబును ఏశావును ఆశీర్వదించెను" (హెబ్రీ 11:20).

విశ్వాస వీరుల పట్టికలో ఇస్సాకు ఐదవ వాడుగా హెబ్రీ 11వ అధ్యాయంలో మనకు కనబడుచున్నాడు. అతడట్టి ఉన్నత స్థానానికి రావడానికి దోహదంచేసిన కొన్ని గుణగణాలను గమనిద్దాం :

**1. తండ్రికి విధేయుడు :** ఎఫెసీ 6:1 లో అపొ. పౌలు ఇట్లు వ్రాసాడు : "పిల్లలారా, ప్రభువునందు మీ తలిదండ్రులకు విధేయులై యుండుడి; ఇది ధర్మమే". పౌలు ఈ మాటలు వ్రాయడానికి వందలాది సంవత్సరములకు ముందే ఇస్సాకు ఈ నియమాన్ని అద్భుతంగా పాటించి చూపాడు.

ఇస్సాకును బలి యర్పించడంలో అబ్రాహాము చూపిన గొప్ప విశ్వాసాన్ని గూర్చి గతమాసం నేను వ్రాసాను, జ్ఞాపకం ఉందా? కాని అప్పుడు ఇస్సాకు పాత్రనుగూర్చి మనం యేమీ చెప్పుకోలేదు. ఈ సంఘటన జరిగేసరికి అబ్రాహాము వయస్సు 130 సంవత్సరాలు,

ఇస్సాకు వయస్సు 33 సంవత్సరాలు. ఇస్సాకు మంచి వయస్సులో యున్నవాడు. అబ్రాహాముకంటే ఇస్సాకు శారీరకంగా బలిష్టుడు, అవసరమయితే అబ్రాహామును ఇట్టే లొంగదీసుకోగలడు. అతని చేతులు బంధింపబడి బలిపీఠముమీద పెట్టబడుచున్నప్పుడు ఇస్సాకు సులభంగా తన తండ్రిని లొంగదీసుకోగలిగి యుండేవాడు. అయితే అతని ప్రాణాన్ని అర్పించుటకొరకు కత్తి పైకెత్తబడినను కూడ ఇస్సాకు తన తండ్రి చేయుచున్న దాన్ని ఆపుచేయుటకు యేమీ ప్రయత్నించ లేదు. అతడు తన తండ్రికి సంపూర్తిగా లోబడి యున్నాడు.

2. ధ్యానించువాడు : ఆదికాండము 24 : 63 లో ఇట్లు వ్రాయబడి యున్నది : "సాయంకాలమున ఇస్సాకు పొలములో ధ్యానింప బయలు వెళ్ళెను". శరవేగంతో పయనించు జీవితాలు గల మనము అనుకరించుటకు ఇస్సాకు ఒక గొప్ప పాఠాన్ని మనకు నేర్పు చున్నాడు. ప్రతివానికి ధ్యానించుటకు, ప్రార్థించుటకు కొన్ని ప్రశాంత ఘడియలు అవసరం. ఇలాగ చేయడంలో మన ఆంతర్య శక్తిని, బలాన్ని పెంపొందించుకొంటాం, జీవితాలను క్రమపర్చుకొంటాం, దేవునితో సన్నిహిత సంబంధం కలిగియుంటాం. ఇటువంటి సమయాలు లేకపోతే మన జీవితాల గమ్యాన్ని పోగొట్టుకొనే ప్రమాదంలో యుంటాం.

3. తన భార్యను ప్రేమించాడు : ఇస్సాకు రిబ్కాను పరిగ్రహించెను. "ఆమె అతనికి భార్య ఆయెను; అతడు ఆమెను ప్రేమించెను" (ఆది 24:67). అనేకమంది భర్తలు తమ భార్యలను ఈనాడు ప్రేమించుట లేదు. అది ఎంత విచారమో! భార్యను ప్రేమించడం అంటే నీ అవసరాలు కోరికలకంటే ఆమె అవసరాలను, కోరికలను ముందుంచుటయే.

4. శాంతిపరుడు : ప్రజలతో ఎలా మెలగాలో ఇస్సాకు మనకొక మంచి పాఠము నిచ్చుచున్నాడు. ఇస్సాకు తండ్రియైన

అబ్రాహాము త్రవ్విన కొన్ని బావులను ఫిలిష్తీయులు పూడ్చివేసారు. ఇస్సాకు ఆ బావులను తిరిగి త్రవ్వించాడు, తన తండ్రి వాటికి పెట్టిన పేర్లను పెట్టాడు. అయితే ఆ నీటినిగూర్చి గెరారు కాపరులు ఇస్సాకు కాపరులతో జగడమాడారు. బలప్రయోగంచేసి ఆ బావులను అతడు తీసికోగలడు గాని అతడట్లు చేయక మరియొక బావిని త్రవ్వాడు. మరల సంఘర్షణరాగా, అతడు మరియొక బావిని త్రవ్వాడు (ఆది 26 : 17-22).

ప్రతివాడు తన హక్కులకోసం పోరాడే లోకంలో ఇస్సాకు బహుశ మన్నలేడు. గాని దేవుని దృష్టిలో అతడు మన్నికగలవాడే.

**5. దేవునియందు విశ్వాసపరుడు :** దేవునియందు తనకున్న విశ్వాసాన్నిబట్టి ఇస్సాకు యాకోబును ఏశావును ఆశీర్వదించాడు. ఆ యాశీర్వచనములు నెరవేరుతవని అతడెరుగును.

మరల విశ్వాసము క్రియల ద్వారా చూపించబడుచున్నట్లు మనం చూడగలుగుచున్నాము. విశ్వాసము రహస్యముగా దాచియుంచుకోగలది కాదు గాని అది దేవుని చిత్తానికి లోబడుటలో ప్రత్యక్షపరచబడును.

— డేవిడ్ జాన్సన్.

---

## క్రీస్తు మార్చును
### *(Christ Changes Things)*

యేసుప్రభువు ఎక్కడికి వెళ్ళినా అక్కడ మార్పులు సంభవించాయని ఒకరు చెప్పారు. ప్రకృతి చట్టములు నెట్టబడ్డాయి; గాలి, సముద్రము నిమ్మళమైనప్పుడు ప్రకృతి శక్తులే ఆయన ఆజ్ఞలకు లోబడ్డాయి. ఆయన ఆజ్ఞలకు దయ్యములు వణికాయి. పిల్లలు ప్రేమించబడ్డారు, స్త్రీలు ఘనపరచబడ్డారు. ద్వేషింపబడిన సుంకరులు సహోదరులవలె పరిగణింపబడ్డారు. పాపము చేసిన స్త్రీ రాళ్ళు రువ్వి

చంపడానికి కంకణం కట్టుకొనిన గుంపునుండి రక్షింపబడింది, మరెన్నడు పాపం చేయొద్దని హెచ్చరింపబడింది. పామరులైన జాలరులు ఆయనకు నమ్మకస్థులైన అనుచరులగునట్లు పిలువబడ్డారు. ప్రతి విధమైన రోగము బాగుచేయబడింది. ఆయన మాటల శబ్దమును వినగానే, లేక ఆయన చేయి తాకగానే చివరకు మరణముకూడా మృతులైనవారిని విడిచి పెట్టవలసి వచ్చింది!

అయితే ఇప్పుడు మనం ఎదుర్కొనే ప్రశ్న యేమంటే, మనము క్రీస్తును ఎరిగిన నాటినుండి మన జీవితాల్లో యేమేమి మార్పులు కలిగాయి? మనం నిజంగా యేసును ఎరిగినవారమైతే మన జీవితాలు పరిశుద్ధంగాను, నిష్కపటంగాను, భక్తియుతంగాను ఉండాలి. పాపపు దురలవాట్లు విరుగగొట్టబడి మార్చబడి యుండాలి; వాటిస్థానే క్రొత్త సదలవాట్లు సత్ క్రియలు రావలసియుండాలి. మన క్రియలన్నిటిలోను యేసుకు ప్రాధాన్యత యివ్వబడాలి. ఈ లోకము యెడల ఉన్న ప్రేమకు బదులుగా, తండ్రియైన దేవునియెడల ఉన్న ప్రేమ చోటు చేసుకోవాలి (1 యోహాను 2:15).

పేతురుకు యేసుప్రభువు యిట్లు చెప్పాడు: "నీ మనసు తిరిగిన తరువాత (నీవు మార్చబడిన తరువాత) నీ సహోదరులను స్థిరపరచుము" (లూకా 22:32). అదేవిధంగా సంవత్సరాల తరబడి క్రైస్తవులుగా యున్నవారు తమ జీవితాల్లో అవుసరమైన మార్పును యేసుప్రభువును కలుగజేయనీయాలి.

యేసు ఎక్కడికి వెళ్ళినను ఎల్లప్పుడు మార్పుతాడని, మార్చ గలడని జ్ఞాపకముంచుకొనుము. ఆయన యెడల మన దృష్టి యుంచి నడిచేకొలదీ మన జీవితాల్లో ఆయన మార్పును కలుగజేస్తాడు!

— టిమ్ రైస్.

## క్రీస్తును ఒప్పుకొనుట

దైవలేఖనము యొక్క ఆజ్ఞ క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనుట. ఒప్పుకొనుట యనగా తెలియపర్చుట, ప్రకటించుట, అంగీకరించినట్లు చెప్పుట, మరియొకరి యెడల ఉన్న విశ్వాసమును వ్యక్తపరచుట యని అర్థము.

ఆయనను అంగీకరించిన ప్రతివానినుండి ప్రభువు దీనికై ఎదురు చూచును. యేసుక్రీస్తు దేవుని కుమారుడని తాను నమ్ముచున్నట్లు ప్రతివాడు ఒప్పుకొనవలెను. ప్రభువైన క్రీస్తు దీని ప్రాముఖ్యతను గూర్చి ఈ విధముగా చెప్పెను: "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేను వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనెరుగనందును" (మత్తయి 10:32, 33).

క్రీస్తును ఒప్పుకొనుటకు అందరూ ఆహ్వానితులే. స్త్రీ అని పురుషుడని యజమానుడని, దాసుడని భేదములేదు. ఈఒప్పుదల క్రీస్తునుగూర్చి చేయవలసియున్నది గాని, ఒకని పాపములనుగూర్చి మాత్రముకాదు.

ఆయనను మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెను. దీనికి సాక్షులుండవలెను. ఒకడు క్రీస్తునందు నిజముగా నమ్మిన యెడల అతడు ఆయనయందు తనకున్న విశ్వాసమును ప్రతివానికి తెలియపరచవలెను. అట్లు ఒప్పుకొనినవానినే పరలోకమందున్న తండ్రి యెదుట ప్రభువు ఒప్పుకొందునని వాగ్దానము చేసెను. మనుష్యుల యెదుట ఒప్పుకొనిన వాడు ఆయనను తృణీకరించినట్లే.

### ఆయనను ఒప్పుకొనని వారి గతి ఏమి?

వీరిని గూర్చి యోహాను ఈ విధముగా నుడివెను: యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెనని యొప్పుకొనని వంచకుడును క్రీస్తు విరోధి (2 యోహాను: 7). "ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహి

మార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లు" (ఫిలిప్పీ 2 : 11). ఎవరైనే క్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించరో, లేక ఒప్పుకొనరో వారిని దేవుడును తృణీకరించును.

## ర క్షిం చు ట కొ ర కు

ఒప్పుకోలు నోటితో మాత్రమే కాక, రక్షించుటకొరకు చేయ వలెనని మనము గ్రహించవలెను. "యేసుప్రభువని నీనోటితో ఒప్పు కొని దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీహృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు. ఏలయనగా నీతి కలుగు నట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10:9, 10).

ఒకడు ఒప్పుకొనినంత మాత్రమునే రక్షింపబడడు. ఈ ఒప్పు కోలు రక్షణ గృహములోనికి ప్రవేశించుటకు ఎక్కవలెను మెట్టు గనుక మరియొక విధముగా చెప్పవలెనన్న క్రీస్తునందు విశ్వాస ముంచుట క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనుట ఇవి మాత్రమే రక్షణను కలుగ జేయవు. ఒకడు విశ్వాసము ఒప్పుకోలు లేకుండా రక్షింప బడలేడు. కాని ఇంకనూ చేయవలసినవి యున్నవి.

ఈ ఒప్పుదల విశ్వసించి, మారుమనస్సు పొందినవానిని బాప్తి స్మమునకు అర్హునిగా చేయును. ఒక మనుష్యుడు ఒప్పుకొనిన యుదం తము మనము క్రొత్తనిబంధనలో అపో. కార్యములలో చదువగలము.

"ప్రభువు దూత - నీవు లేచి, దక్షిణముగా వెళ్ళి, యెరూష లేమునుండి గాజాకు పోవు అరణ్యమార్గమును కలసికొమ్మని ఫిలిప్పుతో చెప్పగా అతడు లేచి వెళ్ళెను. అప్పుడు ఐతియోపీయుల రాణియైన కందాకేక్రింద మంత్రియై ఆమెయొక్క ధనాగారమంతటిమీద నున్న ఐతియోపీయుడైన నపుంసకుడు ఆరాధించుటకు యెరూషలేమునకు వచ్చియుండెను. అతడు తిరిగి వెళ్ళుచు, తన రథముమీద కూర్చుండి ప్రవక్తయైన యెషయా గ్రంథము చదువుచుండెను. అప్పుడు ఆత్మ

ఫిలిప్పుతో నీవు ఆ రథము దగ్గరకు పోయి దానిని కలిసికొనుమని చెప్పెను. ఫిలిప్పు అతని దగ్గరకు పరుగెత్తికొనిపోయి అతడు ప్రవక్తయైన యెషయా గ్రంథము చదువుచుండగా విని-నీవు చదువునది గ్రహించుచున్నావా? అని అడుగగా అతడు ఎవడైనను నాకు త్రోవ చూపకుంటే ఏలాగు గ్రహింపగలనని చెప్పి, రథమెక్కి తనతో కూర్చుండుమని ఫిలిప్పును వేడుకొనెను. అందుకు ఫిలిప్పు నోరు తెరచి ఆ లేఖనమును అనుసరించి అతనికి యేసును గూర్చిన సువార్త ప్రకటించెను. వారు త్రోవలో వెళ్ళుచుండగా నీళ్లున్న ఒక చోటికి వచ్చినప్పుడు నపుంసకుడు ఇదిగో నీళ్లు, నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపుమని ఆజ్ఞాపించెను. ఫిలిప్పు నపుంసకుడు ఇద్దరును నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను. వారు నీళ్ళలోనుండి వెడలి వచ్చినప్పుడు ప్రభువు ఆత్మ ఫిలిప్పును కొనిపోయెను, నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను" (అపొ. కా. 8:26-39).

పై భాగమును గమనించినయెడల ఫిలిప్పు నపుంసకునికి దేవుని వాక్యం బోధించిన పిదప అతడు దానిని విశ్వసించిన తరువాత ఫిలిప్పు నీవు యేసు దేవుని కుమారుడని అంగీకరించుచున్నావా అని అడిగినట్లు మనము గమనించగలము. నపుంసకుడు ఒప్పుకొనిన తరువాత ఫిలిప్పు బాప్తిస్మమిచ్చుటకు అంగీకరించెను.

కనుక ఇప్పుడు నీవు క్రీస్తును అంగీకరించక పోవుటకు తగిన కారణమేమైనా కలదా? యేసుక్రీస్తు సిలువలో నీ కొరకు మరణించి తిరిగి లేచెనని విశ్వసించుము. మారుమనస్సు పొందుము. నీ నోటితో ఒప్పుకొనుము. పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొంది ఆయన రాజ్య వారసుడవు కమ్ము. "తన్ను ఎందరంగీకరించిరో వారి కందరికి అనగా తన నామమందు విశ్వాసముంచిన వారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను (యోహాను 1:12).

— జి. అబ్రహాం పాలస్, కాకినాడ-2.

## "బాప్తిస్మానికి కొన్ని సాధారణ అభ్యంతరాలు"

బాప్తిస్మము అతిగా అపార్థము చేసికొనబడిన బైబిలు విషయాలలో ఒకటి. శతాబ్దాలతరబడి "రక్షించబడటానికి బాప్తిస్మం పొందనవసరములేద"ని బోధ జరుగుతూ వచ్చినది. కాని "బాప్తిస్మం పొందకుండా ఎవడూ రక్షించబడడని" బైబిలు స్పష్టంగా చెప్తూచున్నది. మానవరక్షణకు కర్త, దేవుని కుమారుడూ అయిన యేసు తానే స్వయంగా "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" అని చెప్పాడు (మార్కు 16:16). అపొస్తలుడైన పేతురు సైతం "పశ్చాత్తాపపడి పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మం పొందండి" అని ఆజ్ఞాపించాడు (అపొ. కా. 2:38). బోధకుడైన అననీయ, "లేచి బాప్తిస్మము పొంది నీపాపములను కడిగివేసుకో" అని సౌలును హెచ్చరించాడు (అపొ. కా. 22:16). 1 పేతురు 3:21 లో అసలు "బాప్తిస్మమే మనల్ని రక్షిస్తున్నది" అని మనం చదువుతాము. కాబట్టి బాప్తిస్మం లేకుండా ఎవడూ రక్షించబడడని మనకు తెలుస్తున్నది. అయినప్పటికీ మానవరక్షణలో బాప్తిస్మం పాత్ర ఏమీలేదని నమ్మేవారు ఈ క్రింది అభ్యంతరాలు చెబుతూ వుంటారు.

1. సిలువమీద చనిపోయిన దొంగ బాప్తిస్మము పొందకుండానే చనిపోయాడు. అయినా నాతో పరదైసులో వుంటావని యేసు అతనికి హామీ యిచ్చాడు. అందువలన ఆ దొంగలాగానే మనం కూడా బాప్తిస్మం పొందకుండానే రక్షింపబడవచ్చు అని వారంటారు. కాని వారు లేఖనం తెలియక పొరబడుతున్నారు. సిలువమీద చనిపోయిన దొంగ రక్షణకొరకు బాప్తిస్మం అనే ఆజ్ఞ యివ్వబడక ముందే జీవించాడు, మరణించాడు. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" అని యేసు ఆజ్ఞ యిచ్చేనాటికి ఆ దొంగ శరీరం సమాధిలో వుంది, అతని ఆత్మ పరదైసులో వుంది. కాబట్టి ఈ బాప్తిస్మపు ఆజ్ఞ దొంగ చనిపోయిన కొన్ని వారాల తరువాత

యివ్వబడింది. ఆజ్ఞ లేనపుడు దానికి విధేయులవటం అనే ప్రశ్నే వుండదు. పైగా ఆ దొంగ మోషే ధర్మశాస్త్రముక్రింద బ్రతికాడు, చనిపోయాడు. మోషే ధర్మశాస్త్రం యేసు సిలువమీద చనిపోయిన నాటినుంచి ముగిసింది (కొలస్స 2:14, హెబ్రీ 9:15-17). కాని మనం ఈనాడు క్రీస్తు క్రొత్తనిబంధన క్రింద బ్రతుకుతున్నాం. కనుక ఆయన మరణానంతరం ఇచ్చిన ఆజ్ఞ ప్రకారం రక్షణ పొందటానికి నమ్మి బాప్తిస్మం పొందాలి. ఈ ఆజ్ఞ అబ్రహాము, దావీదులకెలా వర్తించదో, అలానే ఆ దొంగకు కూడా వర్తించదు. ఎందుకంటే వారంతా ఈ ఆజ్ఞ యివ్వకముందున్నవారు.

2. ఒక వేళ ఒక పసిపిల్లవాడు బాప్తిస్మం పొందకుండానే చనిపోతే, అతని ఆత్మ కేమవుతుంది? నమ్మగలిగినవారికే ఈ ఆజ్ఞ యిచ్చాడని మనం గమనించాలి నమ్మినవాడు బాప్తిస్మం పొందాలి. పసిపిల్లలు నమ్మలేరని, వారిని పాపాలనుంచి రక్షించటానికి వారిలో ఏ పాపం లేదని ప్రభువుకు తెలుసు. మత్తయి 19:14 లో "పరలోక రాజ్యం యిలాంటివారిదే" అన్నాడు. రక్షించబడినవారే పరలోక రాజ్యంలో చేరగలరు. కాని ఆ పరలోక రాజ్యం చిన్నపిల్లలవంటి వారిదే అని ఆయన చెబుతున్నాడు గనుక, చిన్నపిల్లలకు బాప్తిస్మం పొందాల్సిన అవసరం వారికి లేదని మనం తెలిసికోవాలి. ఈ పిల్లలే పెరిగి మంచి చెడు తెలుసుకోగలిగి, దేవునికి లెక్క అప్పజెప్పుకోవలసిన స్థాయికొచ్చిననాడు, వారి పాపాలనుంచి రక్షణ పొందటానికి బాప్తిస్మం తీసుకోవాల్సిన బాధ్యత వారిదవుతుంది.

3. బాప్తిస్మంవల్లనే మనం రక్షించబడితే, అది నీటి రక్షణ అవుతుంది. కుష్టురోగి నయమాను సంగతి ఏమిటి? అతను ప్రభువు ఆజ్ఞకు విధేయుడై యొర్దాను నదిలో మునిగినందున బాగుపడ్డాడని బైబిలు మనకు చెబుతున్నది. ఇప్పుడు, నయమాను ఎలా బాగుపడ్డాడు? నీటివలనా? ఖచ్చితంగా కాదు. అది నీటివలన బాగయినది

కాదు. అతను ప్రభుని ఆజ్ఞను నమ్మి విధేయుడవటంవల్లనే బాగుపడ్డాడు (2 రాజులు 5:1-14). యోహాను 9 లోని పుట్టు గుడ్డివాడు యేసు చెప్పినది చేసి బాగుపడ్డాడు. యేసు నేలమీద ఉమ్మి వేసి దానితో బురదచేసి, ఆ బురద అతని కళ్ళకు పూసి, సిలోయము అనే కోనేటిలో కడుక్కో మన్నాడు. ఆపని చేసినపుడు గుడ్డివాడికి చూపు వచ్చి చూడసాగాడు అని బైబిల్లో వుంది (యోహాను 9:6, 7).

కాబట్టి ఆయన పూసిన బురదో, లేక ఆ కోనేటి నీరో అతన్ని బాగుచేసింది అని చెప్పటం వెర్రితనం. వాస్తవ మేమిటంటే అతను దేవుని శక్తిచేత బాగయ్యాడు. కాని ప్రభువు అతనికి చెప్పింది చేసినాకనే అతను బాగయ్యాడు. అలాగే మనంకూడా ఆయన ఆజ్ఞను పాటించినపుడే ఆయన మరణ శక్తిద్వారా మన పాపాలనుంచి రక్షించ బడతాము. నయమాను, ఈ గుడ్డివాడు ప్రభువు ఆజ్ఞను పాటించ కుండా తిరస్కరించి వుంటే వాళ్లు బాగయ్యేవారు కాదు. రక్షించ బడటానికి ప్రభువు ఏమి చెయ్యమని చెప్పాడో, అది చెయ్యకుండా వుంటే మనంకూడా రక్షించబడము (మత్త 7:21; లూకా 6:46, మార్కు 16:16).

4. మనం విశ్వాసంద్వారానే రక్షించబడమా? "క్రీస్తునందు విశ్వాసముంచు ప్రతివాడు రక్షించబడతాడు" అని యోహాను 3:16 చెప్పటం లేదా? అపొస్తలుడైన పౌలు జైలు అధికారితో "యేసునందు విశ్వాసముంచుము, నీవును నీ యింటివారును రక్షించ బడుదురు" అని చెప్పలేదా? (అపొ. కా. 16 : 31) నిజమే. మనిషి విశ్వాసంవలన రక్షించబడతాడని బైబిలు ఖచ్చితంగా చెప్పింది. కాని విశ్వాసంవల్ల మాత్రమే రక్షించబడతామని ఎక్కడా లేదు. యాకోబు 2:19 లో "దయ్యాలుకూడా విశ్వసిస్తున్నాయి" అని వుంది. అయితే దయ్యాలుకూడా రక్షించబడినట్లేగా? 24వ వచనంలో "మనిషి దేవుణ్ణి నమ్మడంవల్ల మాత్రమే కాక, క్రియలవల్ల లెక్కలోకి వస్తాడు" అని

అంటున్నాడు. 26వ వచనంలో "ప్రాణం లేని శరీరం ఎలా మృతమో, క్రియలు లేని విశ్వాసంకూడా మృతమే" అని ముగిస్తున్నాడు. యేసు కూడా ప్రభువా, ప్రభువా అని నన్ను పిలిచేవాడు కాక, ఆయన చిత్తం చేసేవాడే పరలోకంలో ప్రవేశిస్తాడని చెబుతున్నాడు (మత్తయి 7:21). ఒకడు ప్రభువును నిజంగా నమ్మితే ఆయన ఏం చెప్పినా చేస్తాడు. అపొస్తలుల కార్యములు 16 లోని చెరసాల అధికారి యేసును గూర్చి విన్నప్పుడు నమ్మాడు. నమ్మి ఆరాత్రి ఆఘడియయందే బాప్తిస్మం పొందాడని వుంది. అతను మరుసటి ఉదయందాకా కూడా ఆగలేదు. ఎందుకని? అతను రక్షించబడాలని కోరుకొన్నాడు (అపొ.కా. 16 : 30-33).

— సన్నీ డేవిడ్, న్యూఢిల్లీ.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

**To**

..............................

..............................

..............................

..............................